# మార్కెట్ యుద్ధం

ఎన్నో ఏండ్లుగా మార్కెట్‌ను తన గుప్పిట్లో పెట్టుకున్న 'కాల్‌మాల్' టూత్‌పేస్టు అమ్మకాలు క్రమక్రమంగా పడిపోవటం కల్లోల్లాన్ని సృష్టించింది. నష్టాల్లో నడుస్తున్నది. కాల్‌మాల్ సరుకు కావల్సినంత డిమాండుకు తగ్గట్లుగా అందటంలేదని ఇంతకుముందు హోల్‌సేల్ వ్యాపారులనుంచి ఫోన్లు వచ్చేయి. ఇప్పుడు ఉల్టా అయింది. సరుకు ఇప్పుడే పంపకండి అంటూ ఫోన్లు! కాల్‌మాల్ షేర్లు కావాలని ఆరాటపడే జనం ఇప్పుడు కాల్‌మాల్ షేర్లు అంటే వద్దంటున్నారు. మార్కెట్లో కాల్‌మాల్ షేర్లు కూలిపోతున్నాయి. కాల్‌మాల్ ఎమ్‌డి తలపట్టుకున్నాడు. ముప్పై ఏండ్లనుంచి మార్కెట్‌ను ఏలుతున్న కాల్‌మాల్ ఈ విధంగా కావటమేంది! డాక్టర్లకు కావల్సినంత డబ్బు ఇచ్చి కొనుక్కొని పేషంట్లకు కాల్‌మాల్ వాడండి అని చెప్పించారు!

ఇప్పుడు డాక్టర్లు చెప్పినా పేషంట్లు కాల్‌మాల్ కొనటంలేదు. కారణమేంది? లవంగమని, ఉప్పు అనీ, కాల్షియమ్ అనీ ఏ టూత్‌పేస్టు వాళ్ళు తయారు చేయని రకరకాల కాంబినేషన్లు కాల్‌మాల్‌లో వున్నాయి. అన్నిటికీ గిరాకీ వుండేది! సంవత్సరానికో కొత్తరకాన్ని మార్కెట్లోకి వదులుతూంటే కస్టమర్లు పడిపడి కొంటూనే వున్నారు! ఎన్నడూ ఏ సంక్షోభం రాలేదు! హఠాత్తుగా ఈ కల్లోలం ఏంది! ప్రకటనల విషయంలో ఏ లోటు లేకుండా అడ్వర్‌టైజింగ్ శాఖ చూస్తూనేవుంది. మధ్య మధ్యన పెద్ద పెద్ద హీరోహీరోయిన్లతో ప్రకటనలు తయారు చేస్తూనే వున్నారు. మరి ఎక్కడ జరిగింది లోపం.

కాల్‌మాల్ ఆదాయంలో అరవైశాతం ప్రకటనల ఖర్చుకే పోయేది! కస్టమర్లు పెట్టే ధరలో అరవై శాతం ప్రకటనల ఖర్చును భరిస్తున్నారు! లోపలి మాయాజాలం తెలియక కస్టమర్లు ధరకేం జంకలేదు. మంచి వస్తువుకు మంచి ధర చెల్లిస్తున్నామని తృప్తిపడ్డారు. కాల్‌మాల్‌ను కొంటూనే వున్నారు! అనుకోకుండా ఈ దెబ్బ ఏంది? కాల్‌మాల్ ట్యూబ్ అందంలో గాని డబ్బా అందంలో గాని ఏం లోపంలేదు! మరెందుకు కాల్‌మాల్ గిరాకి కూలిపోతున్నది! – అన్ని సెక్షన్ల బాస్‌లను మీటింగుకు పిల్చారు ఎమ్.డి.

ఎమ్‌డి సుందరం చూపులు ప్రొడక్షన్ సెక్షన్ మీద నిలిచాయి. అక్కడ్నుంచి కదలటం లేదు. చచ్చాంరా! - అని కోటును సర్దుకున్నాడు ప్రొడక్షన్ సెక్షన్ బాస్ సెక్వేరా. తను ఏదో ఒకటి జవాబు చెప్పాలి! తడబడ్డాడు సెక్వేరా. అయినా గట్టిగా ఊపిరితిత్తుల్లోకి గాలి పీల్చుకొని - "మిస్టర్ సుందరం! మా డిపార్టుమెంటులో ఏం లోపం లేదు. ప్రతి ఒక్కరం అప్రమత్తంగానే పనిచేస్తున్నాం. దట్ ఐ క్యాన్ అష్యూర్ యూ!" అన్నాడు కొద్దిగా భుజాలెగరేస్తూ.

ఎమ్‌డి మార్కెటింగ్ సెక్షన్ వైపు చూసాడు తీక్షణంగా - దాని హెడ్ గోయల్ చాల ఆత్మవిశ్వాసంతో కన్పించాడు. తన ఎడమ చేత్తో కుడి చెవిని పట్టుకొని లాగాడు. ఆయన నోరు విప్పి మాట్లాడే ముందు అట్లా చేయటం అలవాటే.

"మిస్టర్ సుందరం! మార్కెటింగ్‌లో మేమేం లోపం చేయలేదు. మా అడ్వర్ టెయిజింగ్ శాఖలోనూ ఏ లోపం లేదు. ఈ మధ్య మన యాడ్ ఫిల్మ్‌కు బాగుందని అవార్డు కూడా ఇచ్చారు బిజినెస్ న్యూస్ పత్రికవారు."

అతని మాటలు ఎమ్.డీకి సంతృప్తినియ్యలేదు. వెంటనే ఎమ్‌డి చూపులు వాడిగా గోయల్‌ను దూసుకపోయాయి.

"మిస్టర్! గోయల్! మీరు మార్కెటింగ్ సర్వే చేయించండి సేల్స్ పడిపోవటానికి కారణాలేమిటో. సేల్ డేటా ఏమిటో రెండు రోజుల్లో నా టేబిల్ మీదుండాలి!" గర్జించాడు ఎమ్.డి

ఈసారి ఎమ్‌డి చూపులు క్వాలిటీ సెక్షన్ మీద పడ్డాయి. ఆ సెక్షన్ హెడ్ అగర్వాల్ లేచి నిలబడ్డాడు.

"సర్! క్వాలిటీలో లోపంగాని పరిశోధనలో లోపంగాని ఏ మాత్రం లేదు. ఎప్పటికప్పుడు పరీక్షలు చేస్తూనే వున్నాం. దట్ మచ్ ఐ క్యాన్ అష్యూర్ యూ సర్!" అన్నాడు.

మీటింగు తర్వాత ఎవరి ఆత్మ పరిశోధనలో వాళ్ళు పడ్డారు. మార్కెట్ సేల్స్ పడిపోయాయంటే తమ ఉద్యోగాలు ఊడినట్లే! రోడ్డుమీద పడి అడుక్కోవాల్సిన పరిస్థితులు వస్తాయి. ఎవరికివారే గజగజ వణికిపోతున్నారు - "మా నాన్న ఆఫీసులో గుమాస్తా పనిచేసేవాడు. అది గవర్నమెంట్ ఉద్యోగం. ఇరవై ఏండ్ల వయస్సులో ఉద్యోగంలో చేరాడు. నెలనెలా జీతం తీసుకుంటూ హాయిగా పెండ్లి చేసుకుని పిల్లల్ని కంటూ ఏ చీకూ చింత లేకుండా హాయిగా రిటైర్ అయ్యాడు. ఉద్యోగం పోతుందే ఎట్లా! - అని ఎన్నడూ భయపడలేదు! ఏడాదికోసారి ఇన్‌క్రిమెంట్ తీసుకొని తన తండ్రి తృప్తిపడేవాడు. ఈ హైరైజ్‌లు లేవు. పెద్ద మొత్తం జీతం వస్తున్నదన్న సంతోషం నాకెన్నాళ్ళున్నది! రెండేండ్లు కాలేదు. ఇదిగో ఈ మార్కెట్ పడిపోతున్నదన్న బాంబు పేలింది. నా ఉద్యోగమే మౌతుందో! - హైరైజ్ మాట అటుంచి నా ఉద్యోగం నిలిస్తే చాలు. క్వాలిటీలో ఏం జరిగిందో ఈ మార్కెటింగువాళ్ళు సర్వే చేస్తేగాని తెలదు-" అని అగర్వాల్ గుండె దడదడలాడింది.

కొత్తగా రోజు వేతనంమీద కొంతమంది ఎమ్‌బిఏ చదివే యువతీ యువకులను రిక్రూట్ చేసారు మార్కెటింగు వాళ్ళు. వాడవాడకు వీధి వీధికి ఇంటింటికి పోయి వాళ్ళు

ప్రతి ఒక్కరి అభిప్రాయమడిగారు. కాల్‌మాల్ మునుపటిలా లేదు. "పండ్లుతోముకోగానే నోరంతా తిమ్మిరెక్కినట్లవుతున్నది. పండ్లు మునుపటిలా తెల్లగా వుంటున్నాయి! ఫేస్ట్ నురుగు బాగానే వస్తుంది! కాని నోరంతా పగులుతున్నది ఏది తిన్నా రుచి వుండటంలేదు!" – అని ప్రజాభిప్రాయ సేకరణలో బయటపడింది.

క్వాలిటీ సెక్షన్ హెడ్ అగర్వాల్‌కు పిలుపు వచ్చింది ఎమ్‌డి సుందరం దగ్గరనుంచి. అగర్వాల్ కాళ్ళు గజగజ వణికాయి.

"మిస్టర్ అగర్వాల్ దీనికి్కారణమేమిటో చెప్పండి!" గద్దించాడు ఎమ్.డి.

కాల్‌మాల్‌ను ప్రయోగశాలలో పరీక్షించారు క్షణాలమీద. కాల్‌మాల్‌లో ఎవరో ఆసిడ్‌లాంటి పదార్థాన్ని కలుపుతున్నారని తేలింది. క్షణాల్లో క్వాలిటీ సెక్షన్‌లోనే పనిచేస్తున్న మిస్టర్ గుండూరామ్‌ను పట్టుకున్నారు. ఆ పదార్థాన్ని కలుపుతున్నది నిజమే!

గోల్‌మాల్ కంపెనీ కొత్తగా ఇండియన్ మార్కెట్లోకి ప్రవేశించింది. తమ టూత్‌పేస్టు 'గోల్‌మాల్'ను ప్రవేశ పెట్టి "కాల్‌మాల్" మార్కెట్ ను పడగొట్టాలని ఎత్తువేసారు. వాళ్ళు వేసిన ఎత్తుగడలో మిస్టర్ గుండూరామ్ పడిపోయాడు. డబ్బుకూ గోల్‌మాల్‌లో ఎమ్‌డి పోస్టు దొరుకుతుందన్న ఆశకు లొంగిపోయాడు. కాల్‌మాల్‌ను కల్తీ చేయటానికి అంగీకరించాడు. విదేశీ కంపెనీ గోల్‌మాల్ కుట్రలో కాల్‌మాల్ మార్కెట్ కూలిపోయింది. ఒకప్పుడు మార్కెట్‌ను షేర్‌బజార్‌ను శాసించిన కాల్‌మాల్ ఎందుకు పనికిరానిదయింది. గోల్‌మాల్ నెంబర్‌వన్ పేస్టుగా కొనుగోలును సంపాదించుకుంది. మళ్ళా ఎంత ప్రయత్నించినా కాల్‌మాల్ మునపటి మార్కెట్‌ను పట్టుకోలేకపోయింది. అందాల తారల ప్రకటనలు కూడా వాళ్ల అమ్మకాలను పెంచలేకపోయాయి.

కాల్‌మాల్ గోల్‌మాల్ పేస్టును దెబ్బతీయలేకపోయింది. కొన్నాళ్ళకు మిస్టర్ గుండూరామ్ గోల్‌మాల్ కంపెనీలో ఎమ్‌డిగా చేరాడు.

*"వార్త" ఆదివారం, 2009*